# లింక్

## బుడుబొని శంకరరాజు



టీచర్స్ సెలక్షన్ లిస్టులో తన నెంబరు లేకపోవడం చూసి మోహన్ మనస్సు సెలక్షన్ బోర్డు మెంబర్ల మీద కోపంతో నిండిపోయింది. వయో పరిమితి దాటి పోతున్నాఇంత వరకు చిన్న ఉద్యోగమైనా లభించనందుకు జీవితం మీద విరక్తి భావం అతని కళ్లలో కదలాడసాగింది.

వేసవిలో అడుగంటిన బావిలో ఎండకు తళుక్కున మెరిసే గుక్కెడు నీరులా, సెలక్షన్ లిస్టు చూసేముందు కళ్లలో కనవడిన మెరుపు ఇపుడు అదృశ్యమై పోగా, కళ్లు ఆలోచనలతో "బ్లాక్‌హోల్"లా తయారయిన బుర్రలోకి కృంగిపోయాయి.

మరుసటిరోజు న్యూస్ పేపర్‌లో "టీచర్ సెలక్షన్స్‌లో అవకతవకలు, లంచాలకు అధికార్ల దాసోహం" అన్న శీర్షిక క్రింద ప్రచురించబడిన వార్త చదివిన మోహన్‌లో మళ్లీ ఉద్యోగం మీద ఆశ చిగురించింది. రెండు రోజులు మిత్రులతో కలిసి చేసిన పరిశోధన వలన, లంచాలు తీసుకొన్నారనడానికి కొన్ని ఆధారాలు లభించడంతో, ఆ పోస్టులకు సెలక్టు కాని వారందరూ మోహన్ నాయకత్వంలో కోర్టుకు వెళ్లడానికి నిశ్చయించుకొన్నారు.

మోహన్ కోర్టుకెళ్లే ప్రయత్నంలో మునిగితేలుతుండటం వలన సరిగా ఇంటి పట్టున వుండటంలేదు. చదివించడం తప్ప ఉద్యోగం తీసిచ్చే లౌక్యం తెలియని తండ్రి రామనాథం, కొడుకు కోర్టుకెక్కడం ఇష్టం లేక పోయినా, అతన్నాపే ప్రయత్నం చేయలేదు. కొడుకు పట్టుదల ముందు ఆ ప్రయత్నం సఫలం కాదని అతనికి తెలుసు.

అయితే, రామనాథం తన చిన్నకూతురు స్నేహలత విషయంలో మాత్రం చేయగలిగింది చేసాడు. అది స్నేహలతకు పెళ్లి సంబంధం కుదర్చడం, ఎక్కడెక్కడో తిరిగి సాయంత్రం ఇంటికి వచ్చిన మోహన్‌తో ఆ విషయమే చెప్పాడు

పెరట్లో ఈజీ ఛైర్‌లో కూర్చుని ఏదో నావల్ చదవడంలో నిమగ్నమై వున్న చెల్లెల్ని డిస్టర్బ్ చేయడం ఇష్టంలేక, ఆనంద బాష్పాలతో నిండిన కళ్లతో ఆశీర్వదిస్తున్నట్లు చెల్లెల్నే చూస్తూ "మరి పెళ్లెప్పుడు జరిపించాలని నిర్ణయించారు నాన్నగారు ?"

"అది నిర్ణయించవలసింది నీవే బాబూ !" గోడకు కొట్టిన బంతి, తిరిగి విసరిన వాడికే వచ్చి తగిలినట్లుగా, తను వేసిన ప్రశ్నను తిరిగి తన మీదకే తండ్రి ప్రయోగించడంతో మోహన్ అయోమయస్థితిలో పడ్డాడు

"అంటే! అర్థమయ్యేలా చెప్పండి నాన్నా!"ఆత్రంగా అడిగాడు మోహన్

"ఏమురది బాబూ ! నీ చెల్లెలికి కాబోయే భర్త ఈ మధ్యనే టీచర్‌గా సెలెక్ట్ అయ్యాడు నీ చెల్లెలి వివాహ జీవితం హాయిగా గడచిపోవాలంటే, ఆ అబ్బాయి ఆ ఉద్యోగంలో కొనసాగాలి కాని. " అని, కొడుకు కళ్లలోకి సూటిగా చూస్తూ పెదవులు దాటిరాని ఓ నిగూఢమైన నవ్వు నవ్వి "అలా జరగాలంటే నీవు, మీ మిత్ర బృందం కోర్టుకెళ్లి "స్టే" తేవడం మానుకోవాలి" అన్న తండ్రి మాటలు విన్న మోహన్‌కు కళ్లుబైర్లు క్రమ్మినంతపనైంది

"నీకు ఉద్యోగం వచ్చినా రాకపోయినా, చదువుకున్న వాడివి నీవు ఎలాగోలాగ బ్రతికేయగలవని నాకు నమ్మకముందిరా అబ్బాయి కాని నీ చెల్లెలు బంగారు భవిష్యత్తుకు వచ్చిన ఈ అవకాశం పోగొట్టుకుంటే ...? మళ్లీరాదు బాబూ! కట్నం కూడా పెద్దగా మనశక్తికి మించి వారేమీ అడగలేదు బాబూ మనముండే ఈ ఇల్లు అమ్మేస్తే సరిపోతుంది మరి తుది నిర్ణయం నీదే బాబూ! ఆలోచించుకో!" అర్థింపు , హెచ్చరిక మిళితమైన స్వరంతో చెప్పి వాహ్యాళికి బయలుదేరి వెళ్లిపోయాడు రామనాథం

పడకగదిలో తిరుగుతున్న ఫ్యాన్ క్రింద వెల్లకిలా పడుకొని వున్న మోహన్ ఆలోచనలు, ఆ ఫ్యాన్‌లాగే, బుర్రలో వేగంగా తిరగసాగాయి. ఒక వైపు లంచగొండితనానికి బలైపోతున్న సాటి నిరుద్యోగులు, మరో వైపు తను అమితంగా ప్రేమించే చెల్లెలి బంగారు భవిష్యత్తు ఒకరేమో రక్తం పంచుకొని పుట్టినవారు, మరి ఒకరేమో బాధలు పంచుకొని తననేనమ్ముకుని వున్నారు. తనేం చెయ్యాలి ? ఎవరి పక్షం నిలబడాలి? వ్యక్తి ప్రయోజనానికి, సామూహిక ప్రయోజనానికి మధ్య నలిగిపోతున్న మోహన్ మనస్సు బాధగా మూలిగింది

"అన్నయ్యా"! అన్న చెల్లెలు పిలుపుతో ఆలోచనల నుంచి బయటపడి ప్రశ్నార్థకంగా చూసాడు మోహన్.

"ఇందాకా నాన్నా, నీ మధ్యా జరిగిన సంభాషణంతా విన్నాను, నాకీ పెళ్లి చేసుకోడానికి ఇష్టం లేదన్నయ్యా" గొంతులో జీరవున్నా, స్పష్టంగానే చెబుతున్నట్లుంది

"ఏమిటమ్మా ఆ మాటలు ఇప్పుడేమయిందని" సౌమ్యంగానే అన్నాననుకొన్నాడు కాని ఆ మాటలు అంటున్నప్పుడు చిరాకు ధ్వనించింది

"ఎవరికో! ఏమో అవుతుందని నేనా నిర్ణయం తీసుకోలేదన్నయ్యా పెళ్లికొడుకు వ్యక్తిగత చరిత్ర తెలుసుకున్న తరువాతే ఈనిర్ణయానికొచ్చాను నాకు నాన్న కుదిర్చిన వరుడు ఇంటర్మీడియట్ నాతోనే కలిసి చదివాడు వాడు ఒక వ్యసనాల పుట్ట, ఈవ్ టీజర్ నన్ను కూడా ఒకసారి ఏడిపించాడు. రభసవుతుందని మీతో చెప్పకుండా ఓర్చుకున్నాను అటువంటి వాడిని కట్టుకొని నేను సుఖపడగలనంటావా చెప్పన్నయ్యా?" కళ్లలో నీళ్లు తిరుగుతుండగా, ఆవేశంతో చెప్పినా ఆలోచించే చెబుతున్నట్లనిపించింది మోహన్‌కి

చెల్లెల్ని దగ్గరకి తీసుకొని "నీ కిష్టం లేనిదేదీ ఈ అన్న బ్రతికుండగా జరగదమ్మా ! నాన్నకు నే చెబుతాను కాని, వెళ్లి పడుకోమ్మా!" ఆప్యాయంగా తల నిమురుతూ చెప్పాడు మోహన్

తన సమస్యకు ఇంత తేలిగ్గా పరిష్కారమార్గం లభిస్తుందని ఊహించని మోహన్‌కు ఆ రాత్రి తొందరగా నిద్ర పట్టేసింది

కాని చెల్లెలు స్నేహలత చెప్పిందంతా అబద్ధమని, అసలా పెళ్లికొడుకు ఎవరో తనకు తెలియకున్నా, అన్ని అర్హతలూ వుండి ఎన్నో ఏళ్లుగా ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న తన అన్నలాంటి వారెందరో తమ భవిష్యత్తును మరోసారి పరీక్షించుకొనే అవకాశం తన పెళ్లి వలన ఆగిపోవడం ఇష్టంలేక అలా చెప్పిందని మోహన్‌కు తెలియదు ●



విజయవాడ - హైదరాబాదుల మధ్య బస్సుల రాకపోకలను స్తంభింపచేస్తూ కంచికచర్ల సమీపంలోని సత్యనారాయణపురం వద్ద రోడ్డుకు పడిన గండిని చిత్రంలో చూడవచ్చు వానవస్తే వరదవస్తే ఆ వూరికి యావూరికీ రాకపోకలు బంద్ అది మన దుస్థితి